

తాడోపేడో తేల్చుకుంటాం

ఎస్సీ వర్గీకరణపై కేంద్రంతో తాడోపేడో తేల్చుకుంటామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. - 8లో



104కేజీల గంజాయి పట్టివేత

ఛత్తీస్‌గఢ్‌లోని కుంట గ్రామం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయ్యింది. - 8లో

గరిష్టం/కనిష్టం
31°/24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన జడ్జికి సన్మానం



జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

భువనగిరి: హైకోర్టు రిజిస్ట్రార్ అడ్మిన్‌గా బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలబాస్కర్‌రావును శుక్రవారం భువనగిరి కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు న్యాయమూర్తులు మాట్లాడుతూ జడ్జి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి మారుతీదేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య, ఏజీపీలు కేశవరెడ్డి, బాబురావు, పీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వామి, న్యాయవాదులు బాలకృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, రహీం, రమేష్, జైపాల్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిరండి



శ్యాంసుందర్‌రావు

సాక్షి, యాదాద్రి: వరంగల్‌లో శనివారం జరిగే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు జిల్లా నుంచి బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు పిలుపునిచ్చారు. భువనగిరిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ప్రధాని వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 6 గంటలకే జిల్లా నుంచి బయలు దేరాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ విజయాన్ని కాక్షిస్తూ జరుగుతున్న తొలి బహిరంగ సభ అని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ఊంజలి సేవ



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవాన్ని ఆచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజలి సేవోత్సవాన్ని జరిపించారు. మహిళ భక్తులు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి ఆచార్యులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవోత్సవాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి రూ.14,55,335 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు విండ్ సర్ఫింగ్‌లో శిక్షణ



నాగార్జునసాగర్: ఎన్‌సీసీ నావల్ క్యాడెట్లు నాగార్జునసాగర్ జలాశయంలో శుక్రవారం విండ్ సర్ఫింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. 4 వాయిలర్స్, 2విండ్ సర్ఫర్స్‌లతో స్థానిక విజయవిహార్ హోటల్ నుంచి 20 కిలోమీటర్ల దూరం వరకు జలాశయంలో వెళ్లారు. తిరిగి విజయవిహార్‌కు చేరుకున్నారు. ఒక్కరొక్కరుగా విండ్ సర్ఫర్ మీదకు వెళ్లి తర్ఫీదు పొందారు.

ప్రాణభయంతో పరుగు

ఫలక్‌నూమా రైలులో మంటలు.. భీతిల్లిన ప్రయాణికులు

- ఏం జరుగుతుందో తెలియని అయోమయం
- వరుసగా ఐదు బోగీలు దగ్ధం
- అందులో కాలిపోయిన ప్రయాణికుల సామగ్రి
- దట్టమైన పొగతో భయానకంగా మారిన పగిడిపల్లి ప్రాంతం
- సహాయక చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగం

సాక్షి, యాదాద్రి: కోల్‌కతా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్(రైలు నెంబర్ 12703)లో ప్రయాణికులు మరో అరగంటలో గమ్యస్థానానికి చేరుకోబోతున్నామనే ఆనందంలో ఉండగా.. ఒక్కసారిగా చెలరేగిన మంటలతో భీతిల్లిపోయారు. శుక్రవారం ఉదయం 10 గంటల తర్వాత రైలు బొమ్మాయిపల్లి – పగిడిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్యకు రాగానే ఒక్క కుదుపుతో ఆగింది. ఏం జరుగుతుందో తెలిసేలోపే కొందరు ప్రయాణికులు కిందకు దూకి దూరంగా పరుగెత్తారు. ముందుగా ఒక బోగీ నుంచి మంటలు, పొగ రావడం చూసి అన్ని బోగీలలోని ప్రయాణికులు ఉన్నఫలంగా కిందకు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు.

అప్పటి వరకు సాఫీగా సాగిపోతున్న ప్రయాణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. సెల్‌ఫోన్ చాటింగ్‌లో కొందరు, వస్తున్నామంటూ తమ బంధువులకు సమాచారం ఇచ్చే వారు మరికొందరు, నిద్రలో ఉన్నవారు ఇంకొందరు ఇలా ఎవరి పనుల్లో వారు ఉండగా.. బోగీలకు మంటలు వ్యాపించాయనే సమాచారంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దట్టమైన పొగలు రావడంతో అరుపులు, కేకలు పెట్టారు. ఏమైందో అర్థంకాక, ఏం చేయాలో తెలియక, భయాందోళనతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కిందకు దిగి పరుగులు తీశారు. పొగల వెంట మంటలు వస్తుండడంతో ప్రాణాలతో బయటపడతామా అంటూ కొందరు ఏడుపు మొదలు పెట్టారు. రైలు ఆగడంతో ఒక్క ఉదుటున ప్రాణాలు కాపాడుకునేందుకు శక్తినంతా కూడగట్టుకుని రైల్లోంచి కిందికి దూకారు. రైలు పక్కన ఉన్న ఎత్తయిన మట్టిదిబ్బలను ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నారు. బతుకుజీవుడా అంటూ దొరికిన వాహనం పట్టుకుని గమ్యస్థానం వైపు వెళ్లిపోయారు. అయితే, ఈ ప్రమాదంలో తమ ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నంలో విలువైన లగేజీని మాత్రం రైల్లోని వదిలివేయడంతో మంటలకు కాలిబూడిదైంది. షార్ట్ సర్క్యూటో.. లేక ఎవరైనా కావాలని చేశారో, మానవ తప్పిదంతో జరిగిందో తెలియదు కానీ, పెద్ద ప్రమాదం సంభవించింది. ప్రయాణికులు బోగీల నుంచి బయటకు దూకేశారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. అత్యవసర కిటికీలో నుంచి బయటపడ్డారు. లగేజీ తక్కువగా ఉన్న వారు, మొత్తం లగేజీ లేని వారు ఒక్కో బ్యాగు ఉన్న వారు ముందుగా బయటపడ్డారు. ఓ వైపు మంటలు పెరిగిపోతున్నాయి.. బోగీ నుంచి మరో బోగీకి మంటలు వ్యాపిస్తున్నాయి. మరో వైపు కిక్కిరిసిన ప్రయాణికుల నుంచి బయటపడాలి. ఇంకో వైపు బ్యాగులు వెంట తీసుకుపోలేక నానా యాతనపడ్డారు. చూస్తుండగానే మంటలు బోగీలకు వ్యాపించాయి. ప్రయాణికులంతా అప్పటికే దిగిపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు.



బొమ్మాయిపల్లి-పగిడిపల్లి స్టేషన్ల మధ్యలో దగ్ధమవుతున్న రైలు బోగీలు (ఇన్‌సెట్‌లో) కాలిబూడిదైన బోగీ లోపలి భాగం

ఎవరెక్కడున్నారో తెలియని అయోమయం

బోగీల్లో దట్టమైన పొగలు వ్యాపిస్తుండడంతో ఒకరికొకరు కనిపించని భయానక పరిస్థితి, కుటుంబ సభ్యులు ఎక్కడున్నారో తెలియని ఆందోళన. అయినా తమ ప్రాణాలకంటే ఏదీ ఎక్కువ కాదని బతికి బయట పడాలన్న తపనతో ధైర్యం చేశారు. ప్రాణాలతో బయటపడితే చాలు అనుకుని తమ చేతికి అందిన లగేజీ బ్యాగులతో బయటపడ్డారు.

బోగీ వెనక బోగీకి మంటలు

చిన్నగా రేగిన మంటలు వరుసగా బోగీలకు వ్యాపించాయి. దట్టమైన పొగలతో పగిడిపల్లి ప్రాంతం అంతా భయానక వాతావరణం నెలకొంది. ఎస్4, ఎస్5, ఎస్6, ఎస్3, ఎస్2 బోగీలు మంటలో చిక్కుకున్నాయి. మంటల ధాటికి ఇనుప చువ్వలు, సీట్లు, బోగి ఫైబర్ అన్ని కాలుకుంటూ బోగీ మొత్తం వ్యాపించాయి. ఒక దాని తర్వాత మరొకటి చొప్పున మొత్తం 5 బోగీలు కాలిపోయాయి. మరో రెండు బోగీలు స్వల్పంగా కాలిపోయాయి.

మైనారిటీ గురుకుల విద్యార్థుల సహాయక చర్యలు

రైలులో మంటలు చెలరేగిన ఘటనా స్థలానికి దగ్గరలో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ గుర్తించి మీడియా, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అలాగే పాఠశాల టీచర్లు, విద్యార్థులు వెంటనే స్పందించి ప్రయాణికులను రైలు నుంచి జాగ్రత్తగా దింపి వారికి సహాయపడ్డారు. వారందరిని మైనారిటీ పాఠశాలకు చేర్చి మంచినీరు, పిల్లలకు పాలు, బిస్కెట్లు అందించారు. ఆటోలో హైవే వరకు చేర్చటం, అలాగే మిగిలిన ప్రయాణికులకు, పోలీసులకు, సహాయక సిబ్బందికి భోజనం వసతి ఏర్పాటు చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీఓ భూపాల్ రెడ్డి, పోలీసు అధికారులు పాఠశాల సిబ్బందిని, విద్యార్థులను అభినందించారు.

నా సర్టిఫికెట్లు కాలిపోయాయి



నేను ప్రయాణం చేస్తున్న రైలు బోగి దగ్ధమైంది. నేను, మా అమ్మనాన్నతో కలిసి హైదరాబాద్‌కు వెళ్తున్నాం. మా వద్ద మొత్తం 9 లగేజీ బ్యాగులు ఉన్నాయి. భయంతో నాలుగు బ్యాగులు మాత్రమే తీసుకుని కిందికి దిగాం. పదవ తరగతి, ఇంటర్, ఇంజనీరింగ్ సర్టిఫికెట్లు అన్నీ బ్యాగులోనే ఉన్నాయి. బ్యాగులన్నీ కాలిపోయాయి. అక్కడికి వచ్చిన జిల్లా కలెక్టర్‌కు నా బాధను చెప్పాను. సర్టిఫికెట్లు జారీ కోసం సహాయం చేస్తాని హామీ ఇచ్చారు.

– యశ్విత, ప్రయాణికురాలు, ఒడిశా

చైన్ లాగి కిందికి దూకిన రాజు

రైలులో పొగలు, మంటలు చెలరేగుతుండడంతో ప్రమాదాన్ని పసిగట్టి అందులో ప్రయాణిస్తున్న రాజు అనే ప్రయాణికుడు రైలు చైన్ లాగి పక్కనే ఉన్న తన తల్లితో చెప్పి కిందికి దూకేశాడు. దీంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. స్పృహతప్పి కింద పడిపోయాడు. పోలీస్‌లు రాజును భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. అనంతరం లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలించారు.

సహాయక చర్యలను పరిశీలించిన ఎమ్మెల్యే

ఫలక్‌నూమా రైలు అగ్ని ప్రమాదానికి గురైన విషయాన్ని తెలుసుకున్న భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పరిశీలించారు. అధికారులతో ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని అక్కడ పరిస్థితిని సమీక్షించారు.



సామగ్రితో వెళ్లిపోతున్న ప్రయాణికులు



బోగీల్లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్నిప్రమాదం సంఘటనపై రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో మాట్లాడుతున్న రాచకొండ సీపీ చౌహాన్

సమన్వయంతో అదుపులోకి : కలెక్టర్ పమేలా సత్పతి

అన్ని శాఖల సమన్వయంతో మంటలు ఆర్పినట్లు భువనగిరి కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రయాణికులకు ఆహార సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. మెడికల్ టీమ్స్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

రాచకొండ సీపీ ఆధ్వర్యంలో..

రైలు అగ్నిప్రమాదానికి గురైన ప్రదేశాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సందర్శించారు. రైల్వే శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి.. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతి, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, ఇతర అధికారులు కమిషనర్ వెంట ఉన్నారు.

24న సూర్యాపేటకు సీఎం రాక

- కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల, ఇతర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సూర్యాపేట జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 24వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేటలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. సూర్యాపేటలో 2018 ఫిబ్రవరిలో రూ.21 కోట్లతో జిల్లా పోలీస్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అదే సంవత్సరం మే నెలలో రూ.486 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. మెడికల్ కాలేజీ, ఎస్పీ కార్యాలయ నిర్మాణ పనులు గత నెల చివరి వారంలోనే పూర్తయ్యాయి. కలెక్టరేట్ నిర్మాణం కూడా దాదాపు పూర్తయింది. 2017 జూన్‌లో రూ.19.80 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను వేగంగా పూర్తి చేయించారు. ప్రస్తుతం నిర్మాణాలను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

భువనగిరి టౌన్: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు ప్రభుత్వం బకాయి పడిన వంట సరుకులు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. తమకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం భువనగిరిలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వంట చేసే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26వేల జీతం ఇవ్వాలన్నారు. కొత్త మెనూ ప్రకారం వంట చేసేందుకు రోజుకు కనీసం రూ.600 చెల్లించి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్, నాయకులు సామల శోభన్‌బాబు, గానబోయిన వెంకటేష్, సామల భాస్కర్, వంట కార్మికుల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిన్న కృష్ణ, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 82శాతం ఉత్తీర్ణత

భువనగిరి: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో 82.64 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జూన్ 14 నుంచి 22వ తేదీ వరకు జరిగిన టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,717 మంది విద్యార్థులు హాజరు కాగా 1,419 మంది పాసై 82.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 820 ఉండగా బాలికలు 599 మంది ఉన్నారు. ఉత్తీర్ణులైన వారిలో బాలికల కంటే బాలురే అధికంగా ఉండడం విశేషం.

ఇంటర్ సప్లిమెంటరీలో మెరుగైన ఫలితాలు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. గతనెల జూన్ 12 నుంచి 20వ తేదీ వరకు జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,045 మంది హాజరు కాగా 1,972 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలోనే జిల్లా 10వ స్థానంలో నిలిచింది. ఒకేషనల్‌లో 692 మంది పరీక్షలకు హాజరు కాగా 382 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో రాష్ట్రంలోనే జిల్లా 20వ స్థానంలో నిలిచింది. సెకండియర్ జనరల్ విద్యార్థులు 1,8 40 మంది పరీక్షలు రాయగా 1,149 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లా 62 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది. ఇందులో 428 మందికి 248 మంది విద్యార్థులు పాసై 57శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచి మెరుగైన ఫలితాలు సాధించామని డీఐఈఓ రమణి తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి టౌన్: జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్ చంద్రతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు ఆబ్కారీ, వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమర్థవంతంగా చేయాలన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ కళాశాలల్లో సైకియాటిస్ట్, కళా బృందాలతో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన, కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి అన్నపూర్ణ, సైకియాట్రిస్ట్ డాక్టర్ బ్రాహ్మణి ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలి

అనంతరం ప్రత్యేక ఓటరు సవరణపై అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమావేశంలో ముఖ్య అధికారులతోపాటు భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు భూపాల్‌రెడ్డి, కేవీ.ఉపేందర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేస్తాం

భూ క్రమబద్ధీకరణ పనులు వేగవంతం చేస్తామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రాష్ట్ర భూ పరిపాలన శాఖ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ శుక్రవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఓలు 58, 59, 76, 118 కింద భూ క్రమబద్ధీకరణ, ధరణి పోర్టల్‌పై సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు నాగేశ్వరాచారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు సుందరీకరణకు రూ.7కోట్లు మంజూరు


భువనగిరి: భువనగిరి పెద్దచెరువు సుందరీకరణకు హెచ్‌ఎండీఏ రూ.7 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు శుక్రవారం హెచ్‌ఎండీఏ అధికారుల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భువనగిరి పెద్ద చెరువును మినీట్యాంక్ బండ్‌గా మార్చాలని మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి విన్నవించడంతో నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు.

గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ కె.లక్ష్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులకు ఈనెల 10న మిర్యాలగూడలోని పాత శివాని స్కూల్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బాలికలకు, 11న మిర్యాలగూడ అవంతీపురంలో గల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బాలురకు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావాలి

భూదాన్‌పోచంపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనిఅధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్ హైదరాబాద్‌లోని కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువా కప్పి సన్మానించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తడక వెంకటేశం, సామ మోహన్‌రెడ్డి, అనిరెడ్డి జగన్‌రెడ్డి, ఉపునూతుల వెంకటేశం, తోట శ్రీనివాస్, బండారు ప్రకాశ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసిన నాయకులు

ఆయిల్‌పామ్ సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి

వలిగొండ: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందొచ్చని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వలిగొండ మండలం నెమిలికాల్వలో రైతు, విశ్రాంత జస్టిస్ వంగాల ఈశ్వరయ్యగౌడ్ తన 10 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి కంచర్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడుతూ రైతులు మూస పద్ధతిలో కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా అధిక ఆదాయానిచ్చే ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలన్నారు. ఆయిల్ ఫెడ్ సంస్థనే రైతులను నుంచి నేరుగా పంటను కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ సంస్థ ఎండీ సురేందర్, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ వంగాల భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, మండల రైతుబంధు సమితి కన్వీనర్ మమతానరేందర్‌రెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న రామకృష్ణారెడ్డి

క్లుప్తంగా

శ్రీస్వామిని దర్శించుకున్న సినీనటులు



సినీనటుడు బ్రహ్మాజీ, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని సినీ నటులు బ్రహ్మాజీ, కార్తికేయలు శుక్రవారం వేర్వేరుగా తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న సినీ నటులు, వారి కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

నేటి నుంచి ఆలయ వార్షిక బోనాలోత్సవాలు



శ్రీఆంథోల్ మైసమ్మ అమ్మవారు

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న శ్రీ ఆంథోల్ మైసమ్మ దేవాలయం బోనాలోత్సవానికి ముస్తాబయ్యింది. 18వ వార్షిక బోనాలోత్సవాలు నేటి (శనివారం) నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. అందులో భాగంగా ఆదివారం అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఎన్నో రాష్ట్రాలకు చెందిన వాహనదారులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ ఎస్.మోహన్‌బాబు శుక్రవారం తెలిపారు.

అమ్మవారికి తొలిబోనం

మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని శ్రీఆంథోల్ మైసమ్మ దేవాలయ వార్షికోత్సవాల్లో భాగం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి తొలి బోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు చిలువేరు వెంకటేశం, ఉపాధ్యక్షుడు మల్కాజిగిరి నర్సింహ, ఉప సర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ, ప్రతినిధులు కాశయ్య, అంజయ్య, శంకరయ్య, నర్సింహ, యాదగిరి, బాలయ్య, భిక్షపతి, గణేష్ ఉన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొండమల్లేపల్లి : చెట్టుకు ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సయ్యద్ రెహమాన్‌అలీ ఈనెల 5న తన భార్య సమీనాను రోకలిబండతో బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటి నుంచి రెహమాన్‌అలీ పరారీలో ఉన్నాడు. శుక్రవారం రెహమాన్ అలీ హైదరబాద్ సమీపంలో ఉన్న ఆదిభట్ల వద్ద ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో భార్య, భర్తలిద్దరూ చనిపోవడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి

• రూ.25వేల మద్యం స్వాధీనం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని తిరుమలగిరి రోడ్డు వైపు ఉన్న ఓ బెల్టుషాపుపై శుక్రవారం స్థానిక పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సుమారు రూ.25 వేల మద్యం పట్టుబడింది. 58 బీర్లు, ఐబీ 4 ఫుల్ బాటిళ్లు, 6 క్వార్టర్లు, ఓసీ 10 ఫుల్‌బాటిళ్లు, 6క్వార్టర్ బాటిళ్లు, 90ఎంఎల్ 18, రాయల్ స్టాగ్ 2, మెన్షన్ హౌస్ బ్రాండ్ ఆఫ్ బాటిల్ మద్యం పట్టుకొని సీజ్ చేసి దుకాణ యజమాని యాదగిరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.



బొమ్మాయిపల్లి - పగిడిపల్లి స్టేషన్ మధ్య అగ్నిప్రమాదంతో నిలిచిన బోగీల నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులు



దగ్ధమవుతున్న బోగీలలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



స్పృహ తప్పి పడిపోయిన ప్రయాణికుడు రాజును ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు



రైలు అగ్నిప్రమాదాన్ని పరిశీలించిన రైల్వే జీఎం అరుణ్‌కుమార్, సిబ్బంది



సంఘటనా స్థలానికి వచ్చిన ఫైర్ ఇంజన్‌లు



బీబీనగర్ స్టేషన్‌లో కాలిన బోగీలను పరిశీలిస్తున్న సెక్యూరిటీ కమిషనర్, అధికారులు



రైల్ బోగీల నుంచి సామగ్రితో నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు



కాలిబూడిదైన ఎస్-2 బోగీ నుంచి ఎస్-1 బోగీని పోలీస్ సిబ్బందితో వేరుచేస్తున్న సిబ్బంది



రైలు అగ్నిప్రమాదం సంఘటన స్థలాన్ని మార్క్ చేస్తున్న రైల్వే సిబ్బంది

మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది

భువనగిరి : ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ రైలుకు అంటుకున్న మంటలను అగ్నిమాపక సిబ్బంది కష్టపడి అదుపులోకి తెచ్చారు. పగిడిపల్లి సమీపంలో రైలు బోగీలకు నిప్పంటుకుని మంటలు ఎగిసిపడుతున్న సమాచారంతో రైల్వే ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఆలేరు, యాదగిరిగుట్ట, చర్లపల్లి, రామన్నపేట, చౌటుప్పల్ నుంచి అగ్నిమాపక యంత్రాలను సంఘటనా స్థలానికి తరలించారు. ముందుగా మంటలు అంటుకున్న ఐదు బోగీలను ప్రధాన రైలు నుంచి విడదీశారు. దీంతో 11 బోగీలు ప్రమాదం బారిన పడకుండా కాపాడగలిగారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి 12 వాటర్ ట్యాంకర్ల నీటితో మంటలను అదుపులోకి తెచ్చారు. తద్వారా ప్రాణ నష్టం జరగకుండా చూశారు.

కొన్ని రైళ్ల నిలిపివేత.. మరికొన్నింటి దారిమళ్లింపు

నల్లగొండ క్రైం : బొమ్మాయిపల్లి–పగిడిపల్లి మధ్యలో ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు దగ్ధమైన నేపథ్యంలో శుక్రవారం పలు రైళ్లను ఆయా స్టేషన్లలో నిలిపివేశారు. 11.20 నల్లగొండ స్టేషన్‌కు రావాల్సిన రేపల్లె ఎక్స్‌ప్రెస్‌ను నడికుడి స్టేషన్‌లో నిలిపివేశారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే రేపల్లె రైలును రద్దు చేశారు. శబరి ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ నుంచి కాజీపేట మీదుగా మళ్లించారు. సికింద్రాబాద్ వైపు సాయంత్రం 6.20 గంటలకు నల్లగొండ నుంచి వెళ్లాల్సిన విశాఖ ఎక్స్‌ప్రెస్ రాత్రి 8 గంటలకు వెళ్లింది. పల్నాడు, చైన్నై, నారాయణాద్రి రైళ్లు ఆలస్యంగా వెళ్లాయి. నల్లగొండ రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సమీప ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల్లో వెళ్లిపోయారు. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన వారు తమ ప్రయాణాలను రద్దుచేసుకున్నారు. కాగా, ఫలక్‌నూమా బోగీల దగ్ధంపై రైల్వే యాక్టు 80/2023 కింద కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో వెళ్లిన రైల్వే ప్రయాణికులు



బస్సులో వెళ్తున్న రైలు ప్రయాణికులు

రామన్నపేట: బొమ్మాయిపల్లి–పగిడిపల్లి గ్రామాల మధ్య ఫలక్‌నూమా రైలు శుక్రవారం అగ్ని ప్రమాదానికి గురికావడంతో తిరువనంతపురం నుంచి సికింద్రబాద్ వెళ్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ రైలును రామన్నపేట రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. ఈ రైలులో సుమారు 1500 మందికి పైగా ప్రయాణికులున్నారు. వారిని 12 ఆర్టీసీ బస్సుల్లో సికింద్రబాద్‌కు పంపించారు. మరికొందరు ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లిపోయారు. ప్రయాణికుల్లోని చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడుతుండగా వారికి రామన్నపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోతురాజు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి జాడ సంతోష్, వార్డు సభ్యుడు బడుగు రఘు, ఎండి.కరీంలు వాటర్ బాటిల్స్, బిస్కెట్స్, పండ్లు అందజేశారు.

పులిహోర పంపిణీ చేసిన రైల్వే సిబ్బంది



ప్రయాణికులకు పులిహోరా అందజేస్తున్న రైల్వే సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్: ఫలక్‌నూమా రైలు బోగీలు దగ్ధం కావడంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో గంటల తరబడి వేచి ఉన్న ప్రయాణికులకు రైల్వే సిబ్బంది, స్టాల్స్ నిర్వాహకులు పులిహోరా, అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ అశ్విన్‌కుమార్, బీర్బల్, సైదానాయక్, బాబునాయక్ తదితరులున్నారు.

1991లో కాకతీయ రైలు ప్రమాదం

సాక్షి యాదాద్రి : బొమ్మాయిపల్లి వద్ద శుక్రవారం జరిగిన ఫలక్‌నూమా రైలు దగ్ధం ఘటన.. 1991లో జరిగిన కాకతీయ రైలు ప్రమాదాన్ని గుర్తుచేసింది. సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు వెళ్తున్న కాకతీయ ప్యాసింజర్ రైలు చర్లపల్లి - ఘట్‌కేసర్ మధ్య 1991లో అగ్ని ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంలో అప్పుడు 100 మందికి పైగా ప్రయాణికులు మంటల్లో కాలిపోయారు. విద్రోహులు ప్యాసింజర్ బోగీలోకి ఎక్కి రైలు చర్లపల్లి దాటగానే మండే స్వభావం ఉన్న ద్రవ ప్రదార్థం సీట్లకిందికి పారబోసి నిప్పటించారు. ఆ వెంటనే వారు నడిచే రైల్లోంచి కిందికి దిగి పారిపోగా అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు చనిపోయారు. మరో బోగికి నిప్పంటుకోకుండా ప్రయాణికులే ఇతర బోగిలను కాలిపోతున్న బోగి నుంచి విడదీశారు.

చాలా కష్టంగా బయటికి వచ్చాను



ఎస్–5 బోగీలో నా సీటు ఉంది. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు చాలా భయపడ్డాం. రైలు ఆగిపోయే సరికి బయటకు వచ్చేందుకు ఒకేసారి అందరూ ప్రయత్నం చేయడంతో తొక్కిసలాట జరిగింది. చాలా కష్టంగా బయటికి వచ్చాం. కొందరు లగేజీ లోపలే వదిలి వచ్చారు. చాలా మందికి నష్టం జరిగింది.

– కాబుల్, ఒడిశా

సౌకర్యాలు కల్పించలేదు



ఫలక్‌నూమా రైలులో నల్లగొండ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్నాం. ఈ సమయంలో పగిడిపల్లి వద్ద బోగీలలో మంటలు వ్యాపించాయి. అటవీ ప్రాతంలో మేము అందరం దిగిపోయాం. అధికారులు ఇక్కడికి చేరుకుని.. మమ్మల్ని సురక్షితంగా సికింద్రాబాద్‌కు తరలిస్తామని చెప్పారు. బస్సులు వస్తాయి అని రెండు గంటలకు పైగా ఆపారు కానీ, బస్సులు రాలేదు. రోడ్డుపైకి వెళ్లి ఇతర వాహనాలలో వెళ్లిపోతున్నాం.

– సాజీద్, రైల్వే ప్రయాణికుడు

మూడు ఇళ్లలో చోరీ..

• మిర్యాలగూడలో ప్రజల భయాందోళన



యాదగిరిరెడ్డి ఇంట్లో బీరువాను తెరిచిన దొంగలు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. గతంలో ఇంటికి తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీకి పాలప్డే దొంగలు ఇప్పుడు రూటు మార్చారు. ఇప్పుడు మనుషులు ఇంట్లో ఉండగానే ఇంట్లోకి ప్రవేశించి చోరీ చేయడం సంచలనంగా మారింది. వారు చోరీకి వచ్చే సమయంలో ఇంట్లో వారు లేచి ఎదురు తిరిగితే వారికి ఎలాంటి ప్రాణ నష్టం కలిగిస్తారోనని పట్టణ ప్రజలు హడలెత్తి పోతున్నారు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున సంతోష్‌నగర్ కాలనీలో వంగాల యాదగిరిరెడ్డి తన కుటుంబ సభ్యులతో ఒక బెడ్‌రూంలో నిద్రిస్తుండగా ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు మరో బెడ్ రూంలో ఉన్న బీరువా, ఇంట్లోని వస్తువులను చిందరవందర చేసి ఆయన చొక్కాలో ఉన్న రూ.2వేలను తీసుకుని, పక్కనే ఉన్న వంగాల లింగారెడ్డి ఇంట్లోకి ప్రవేశించి ఆయన ఇంట్లో రూ.7వేలను చోరీ చేశారు. అదే విధంగా భాగ్యనర్‌కాలనీలో గల శ్రీనివాస్ అనే ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు రూ.7500 చోరీ చేసి జారుకున్నారు. ఉదయం లేచి చూసిన వారు ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న టూటౌన్ సీఐ నరసింహారావు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం నల్లగొండ నుంచి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో రోజురోజుకు దొంగతనాలు పెరుగుతున్నాయని, రాత్రి సమయంలో పోలీసుల గస్తీని పెంచి దొంగల బెడదను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



మృతి చెందిన కందుకూరి వీరయ్య

గరిడేపల్లి : విద్యుత్ తీగ మీదపడి ఓవ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని సర్వారం గ్రామశివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ గ్రామానికి చెందిన కందుకూరి గోపమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని సర్వారం గ్రామానికి వచ్చింది. గోపమ్మ కుటుంబం గ్రామాలు తిరుగుతూ కథలు చెబుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి వచ్చిన వారు గ్రామ శివారులో గల పంట పొలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో గుడిసెలో కరెంట్ లేకపోవడంతో గోపమ్మ కుమారుడు వీరయ్య (17) పక్కనే ఉన్న రావి చెట్టు ఎక్కి కర్రతో కరెంట్ వైర్ సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కర్ర నుంచి విద్యుత్ సరఫరా జరిగి షాక్ తగిలింది. దీంతో అతడు చెట్టు పైనుంచి కిందపడిపోయాడు. కిందపడిన వీరయ్యపై విద్యుత్ తీగ తెగిపడడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి గోపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతుడికి తల్లితో పాటు ఒక అక్క, ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు.

ప్రాణం తీసిన చేపల వేట

• చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి



కోటేష్ (ఫైల్)

కనగల్ : సరదాగా చేసిన చేపల వేటతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఎం గౌరారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండలి కోటేష్(25) నిడమనూరు మండల పరిధిలోని మారెపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితులు సంజీవ, సురేష్‌లతో పాటు ఎం గౌరారం గ్రామానికి చెందిన అశోక్‌లతో కలిసి మారెపల్లిగౌరారం శివారులో ఉన్న చెరువు వద్దకు ఉదయం చేపల వేటకు వెళ్లారు. చెరువులో కరెంట్‌తో చేపలు పడుతున్న క్రమంలో అశోక్‌కు మొదటగా షాక్ తగలడంతో తృటిలో తప్పించుకున్నాడు. ఇదే సమయంలో పక్కనే ఉన్న కోటేష్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కొట్టి పడిపోయాడు. ఇది గమనించిన స్నేహితులు కోటేష్‌ను నల్లగొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కోటేష్ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తలించినట్లు వెల్లడించారు.

చెరువులోకి దూసుకెళ్లిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్

మునుగోడు: నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ శుక్రవారం ఆ గ్రామంలోని పెద్ద చెరువులోకి దూసుకెళ్లింది. గ్రామ పంచాయితీ మల్టీపర్పస్ వర్కర్లు సమ్మెలో ఉండగా ఆ ట్రాక్టర్‌ను అనుభవం లేని మరొక వ్యక్తి నడపడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామంలో ఓ వ్యక్తి మరణించగా మృతదేహాన్ని స్మశానవాటిక వద్దకు తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ కావాలని మృతుని కుటుంబ సభ్యులు సర్పంచ్‌ని అడుగగా ఆమె పంచాయతీ ట్రాక్టర్‌ను పంపించారు. అయితే అంత్యక్రియలు ముగిసిన అనంతరం ఆ ట్రాక్టర్ తీసుకెళ్లిన వ్యక్తి దానిని శుభ్రం చేసేందుకు పక్కనే ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న పెద్ద గుంతలు గమనించకపోవడంతో ఒకేసారి ఆ ట్రాక్టర్ చెరువులోకి దూసుకెళ్లింది. దానిని గమనించిన ఆ డ్రైవర్ ట్రాక్టర్‌ని వదిలి కిందకు దూకతంతో అతనికి ఏమీకాలేదు. ట్రాక్టర్ మాత్రం నీటిలో మునిగిపోయింది.



చెరువులో మునిగిపోయిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెనుప్రమాదం



లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తుర్కపల్లి : మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామశివారులో గల ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, లారీ ట్యాకర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భువనగిరి నుంచి గజ్వేల్‌కు సుమారు 30మందికి పైగా ప్రయాణికులతో వెళ్తుంది. ఈ తరుణంలో గజ్వేల్ వైపు నుంచి ఘాట్‌రోడ్డులో లారీ ఎదురురావడంతో ఓ మూలమలుపు వద్ద బస్సు లారీని బలంగా ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. పక్కనే ఉన్న పెద్దలోయలో పడిఉంటే పెనుప్రమాదం సంభవించేదని ప్రయాణికులు భయాదోళనకు గురయ్యారు.

104కేజీల గంజాయి పట్టివేత

• ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్‌కు తరలించే యత్నం
• మత్తుకు అలవాటై.. గంజాయి రవాణా చేస్తున్న యువకులు
• కారు ఫల్టీకొట్టడంతో పట్టుబడిన నిందితులు
• వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లను చూపుతున్న నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి

చిట్యాల : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కుంట గ్రామం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఓ కారులో గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టురట్టయ్యింది. ఈ ముఠాలో ఇంజనీరింగ్ విద్యను చదువుతూ గంజాయి మత్తుకు అలవాటుపడిన యువకులు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని షేక్‌పేటకు చెందిన బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న గుంటి సాయివరుణ్ అతడి స్నేహితుడు తనూజ్ కలిసి స్థానికంగా గంజాయి కొనుగోలు చేసి తాగుతూ మత్తుకు అలవాటు పడ్డారు. దీంతో వారు స్థానికంగా కాకుండా గంజాయి సరఫరా చేసే వారి నుంచి నేరుగా గంజాయిని కొనుగోలు చేయాలని నిర్ణయించుకుని మరో స్నేహితుడు టీల్లు ద్వారా ఛత్తీసగఢ్‌కు చెందిన మోహన్‌ను సంప్రదించారు.

స్విఫ్ట్ కారులో రవాణా చేస్తూ..

అనంతరం సాయివరుణ్, తనూజ్‌లు హైదరాబాద్‌లోని మాదాపూర్ నుంచి ఓప్రైవేట్ ట్రావెల్స్ నుంచి లాంగ్ డ్రైవింగ్‌కు వెళ్తున్నట్లు ఓ స్విఫ్ట్ కారును ట్రావెల్స్ నుంచి అద్దెకు తీసుకున్నారు. దీంతో వారు ఆ కారులో ఛత్తీసగఢ్‌కు వెళ్లారు. అనంతరం వారు ఛత్తీసగఢ్ రాష్ట్రంలోని కుంట గ్రామంలో మోహన్‌ను కలిసి అతడి వద్ద నుంచి రెండున్నర కేజీల గంజాయి ప్యాకెట్లను కొనుగోలు చేసి బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఇదే క్రమంలో గంజాయి అమ్మకందారుడు మోహన్‌తో పాటు అతడి బావమరిది మల్లికార్జున్ నేను కూడా హైదరాబాద్‌కు వస్తానని, తన దగ్గర ఉన్న పది ప్యాకెట్లను కూడా ఈ కారులోనే తీసుకెళ్లాలని కోరాడు. దీంతో యువకులు అందుకు ఒప్పుకుని ఆ గంజాయిని కూడా కారులో వేసుకున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులోని ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు రాగానే అదుపుతప్పి ఫల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో తనూజ్, మోహన్, మల్లికార్జున్‌లు కారులోంచి బయటికి వచ్చి తప్పించుకోగా సాయివరుణ్ తీవ్ర గాయాలతో కారులోనే చిక్కుపోయి పోలీసులకు చిక్కుకున్నాడు. దీంతో వారు కారులో తనిఖీ చేయగా సుమారు 104 కేజీలకు పైగా గంజాయి ప్యాకెట్లు లభ్యమైనట్లు, వాటి విలువ సుమారు రూ.20లక్షలకు పైగా ఉంటుందని డీఎస్పీ పేర్కొన్నారు. గాయపడిన సాయివరుణ్‌ను అదుపులోకి తీసుకోని ఆసుపత్రిలో చికిత్స జరిపిస్తున్నట్లు, పరారైన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ టి.మహేష్, ఎస్ఐ ఇరుగు రవి, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణపై కేంద్రంతో తాడోపేడో తేల్చుకుంటాం

• ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో జెండా ఎగురవేస్తున్న మంద కృష్ణ మాదిగ

కోదాడఅర్బన్ : ఎస్సీ వర్గీకరణ కోసమే ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందని, వర్గీకరణపై కేంద్రంతో తాడోపేడో తేల్చుకుంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శుక్రవారం కోదాడలో జరిగిన వేడుకల్లో పాల్గొని సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పీడిత వర్గాల ఆస్తిత్వానికి, ఆత్మగౌరవానికి నిదర్శనంగా ఎమ్మార్పీఎస్ పుట్టిందని, కేంద్రంపై వత్తిడి తీసుకొచ్చి వర్గీకరణ సాధించుకుంటామన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలం అంటూనే పార్లమెంట్‌లో తమకు అనుకూలమైన చట్టాలను చేసుకుంటూ ఎస్సీ వర్గీకరణ చట్టం చేయకుండా జాప్యం చేస్తుందన్నారు. కేంద్రంపై ఉద్యమాలకు మాదిగలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పీడిత వర్గాల ఆత్మగౌరవానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 29సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏపూరి రాజు మాదిగ, కత్తి వెంకటేశ్వర్లు, కొండపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

LOST

I, Bairu Prashanth, S/o. Bairu Anjaiah, R/o. H.No.1-20, Jalapur Village, Bhoodan Pochampally Mandal, Yadadri Bhongiri District. have lost my Original Passport bearing No. S1080506 While I was Traveling from Jalapur to Pochampally. If anyone found Pls Contact: 9030090621. [HA-11285]

Wanted

Wanted Experienced Teachers for E/M High School Sub : English, Science, Maths, Social Studies Salary Negotiable, Ramanna pet, Yadadri Bhongiri Cell : 9652531679 [Y-753146]

ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు వ్రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 56208 [V-6179]

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
... : 9010178203
... : 9912220740
9010422240, 9010038110
... : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.